సాక్షి
ములుగు
శనివారం । 12 । జూలై । 2025



విద్యుత్ అంతరాయాలు తగ్గాలి
విద్యుత్ అంతరాయాలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో▸



పాఠశాలకు అరుదైన అవకాశం
మహబూబాబాద్ జిల్లాలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరుదైన అవకాశం దక్కింది. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం $31^{0}/24^{0}$
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



ములుగు రూరల్: సీజనల్ వ్యాధుల నివారణకు మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం మున్సిపాలిటీ పరిధి గడిగడ్డ ప్రాంతంలో వైద్య శాఖ, ఆశాలతో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి రోగాల బారిన పడతారన్నారు. నీటి నిల్వలు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్, యాంటీ లార్వా మందులు పిచికారీ చేయించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల ప్రభుత్వ పాటించాలని సూచించారు. మున్సిపాలిటీ నుంచి నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిసెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్: దివ్యాంగులు ఆర్థిక స్వావలంబన పొంది సాధారణ జీవితం గడిపేందుకు ప్రభుత్వం దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉపాధి, పునరావాస పథకం ప్రవేశపెట్టినట్లు జిల్లా సంక్షేమాధికారి తుల రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 శాతం వైకల్యం కలిగి ఉండి 21 సంవత్సరాల నుంచి 55 వయస్సులోపు వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆదాయ పరిమితి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉండాలని పేర్కొన్నారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.టీఎస్‌బీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ వెబ్ సైట్‌లో ఈనెల 14 నుంచి 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ



ములుగు రూరల్: ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు డాక్టర్ మోహన్‌లాల్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈనెల 7న జనరల్ మెడిసిన్ విభాగంలో ములుగు మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్‌కు పదోన్నతి కల్పిస్తూ సూపరింటెండెంట్‌గా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్‌ను పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు భిక్షపతిరావు, తైలం గౌతమ్ తదితరులు ఉన్నారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలి

ములుగు రూరల్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించే వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని లీడ్ ఇండియా గ్లోబల్ సమన్వయకర్త డాక్టర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీన ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 'నివాస యోగ్యమైన భూగోళ పరిరక్షణ' అంశంపై వ్యాస రచన పోటీలుంటాయని తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలి



ములుగు రూరల్: విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఏటీడీఓ దేశీరాం, జీసీడీఓ సుగణ అన్నారు. ఈమేరకు శుక్రవారం జగ్గన్నపేట ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మీ, వార్డెన్ బారోత్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

భూపాలపల్లి అర్బన్: డీడబ్ల్యూఓపై అసత్యపు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన పట్టణానికి చెందిన మాచర్ల సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వనాల జిల్లాకు వన్నె తెచ్చేలా..

జిల్లాలో వన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో 10 లక్షల మొక్కల పెంపకం..

ములుగు జిల్లాలోని 171 గ్రామ పంచాయతీ నర్సరీల్లో 11,59,193 మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీ నర్సరీలో 6 వేల మొక్కల చొప్పున పెంచారు. దీంతో పాటు అటవీ శాఖ ఆధ్వర్యంలో మూడు నర్సరీల్లో 2.15 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఇందులో 1,00,793 మొక్కలను గతంలో నాటిన వాటి స్థానంలో నాటనున్నారు. నర్సరీల్లో నీడనిచ్చె చెట్లతో పాటు, పండ్ల మొక్కలు, పూల మొక్కలను పెంచుతున్నారు. నీడనిచ్చే మొక్కలు కానుగ, ఎర్రతొగరు, నారేప, రావి, మర్రి, జువ్వి, ఇప్ప, వెదురు చెట్టు, పండ్ల మొక్కలు జామ, మామిడి, నిమ్మ, పనస, పూల మొక్కలు మందార, మల్లె, గులాబీ మొక్కలను పెంచుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో పండ్ల, పూల మొక్కల్ని పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.



ఇప్పటి వరకు నాటిన మొక్కలు

ములుగు జిల్లాలో 2022 నుంచి 2024–25 వరకు మొత్తం 14,39,967 మొక్కలు నాటినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఇందులో 14,00,967 మొక్కలు సమృద్ధిగా పెరిగాయని డీఆర్డీఏ అధికారులు తెలిపారు. మొక్కల సంరక్షణకు 10.17 కోట్లు వెచ్చించారు. ఈఏడాది వివిధ శాఖల ద్వారా జిల్లాలో టార్గెట్ 14,00,165 మొక్కలు నాటనున్నారు.

టార్గెట్ ఇలా..

ప్రభుత్వ శాఖ	మొక్కలు (లక్షల్లో..)
అటవీశాఖ	3.9
డీఆర్డీఓ	5.65
వ్యవసాయశాఖ	1.3
పోలీస్	0.9
ఉద్యాన శాఖ	0.63
ఇరిగేషన్	0.15
మున్సిపల్ అథారిటీస్	1లక్ష
విద్యాశాఖ	0.1
పశుసంవర్ధక శాఖ	0.03
హెల్త్ అండ్ మెడికల్	0.005
ఎలక్ట్రిసిటీ	0.1
ట్రైబల్ వెల్ఫేర్	0.5
ఇతర శాఖలు	0.01

- ఈఏడాది 14.16 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- 171 నర్సరీల్లో మొక్కల పెంపకం

అడవుల ఖిల్లా.. ములుగు జిల్లాకు మరింత వన్నె తెచ్చేలా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వన మహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 14.16 లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ శాఖలకు టార్గెట్ విధించారు. ఆయా నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో వర్షాలు కురవగానే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ములుగు రూరల్



మల్లంపల్లి పరిధి అటవీశాఖ నర్సరీలో మొక్కలు

విస్తారంగా అడవులున్నప్పటికీ ములుగు జిల్లాలో అదే స్థాయిలో చెట్ల నరికివేత ఉందనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న అడవుల్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం 'వన మహోత్సవం' పేరిట బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు మరికొద్ది రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఇప్పటి వరకు నాటిన మొక్కలు
ములుగు జిల్లాలో 2022 నుంచి 2024–25 వరకు మొత్తం 14,39,967 మొక్కలు నాటినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఇందులో 14,00,967 మొక్కలు సమృద్ధిగా పెరిగాయని డీఆర్డీఏ అధికారులు తెలిపారు. మొక్కల సంరక్షణకు 10.17 కోట్లు వెచ్చించారు. ఈఏడాది వివిధ శాఖల ద్వారా జిల్లాలో టార్గెట్ 14,00,165 మొక్కలు నాటనున్నారు.

జిల్లాలోని మండలాలు	10
జనాభా	2,94,671
జిల్లా విస్తీర్ణం	3,881 స్క్వేర్ కిలోమీటర్లు
జిల్లాలో అటవీ విస్తీర్ణం	2,00,835 హెక్టార్లు

సమాజ బాధ్యతగా తీసుకోవాలి..

మొక్కల సంరక్షణను పౌరులంతా బాధ్యతగా తీసుకోవాలని ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి డోలి శంకర్ సూచిస్తున్నారు. వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయనతో మినీ ఇంటర్వ్యూ.. ఆయన మాటల్లోనే.. వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ శాఖలకు టార్గెట్లు విధించింది. మొక్కల సంరక్షణకు ప్రధానంగా ట్రీగార్డులను వినియోగించాలి. నేలకు అనువైన మొక్కలు నాటడంతో పాటు న్యూట్రీషన్ అందించేలా చూడాలి. మొక్కలకు చెదలు రాకుండా గుళికలను వినియోగించాలి. నీడనిచ్చే చెట్ల ఎదుగుదలలో క్రూనింగ్ చేస్తే ఏపుగా పెరుగుతాయి. దీంతో పాటు మొక్కలకు కాంపోస్ట్ ఎరువుల్ని వినియోగిస్తే ఎదుగుదల బాగుంటుంది.



వాజేడు మండలం పేరూరు వద్ద బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



పెరుగుతున్న గోదావరి ఉధృతి

వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో గోదావరి ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో వాజేడు మండలంలో గోదావరి ఉప్పొంగుతోంది. పలు చోట్ల రహదారులు ముంపునకు గురయ్యాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు అప్రమత్తమై పలు చోట్ల వంతెనలు మూసివేశారు. ప్రజలెవ్వరూ నీటిలోకి వెళ్లకుండా రహదారులపై ట్రాక్టర్లను అడ్డుపెట్టారు.

- మరిన్ని వార్తలు 8లో▸

సఖి సేవలు వినియోగించుకోవాలి

ములుగు రూరల్: గృహ హింస బాధితులు సఖి సేవలు వినియోగించుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్ అన్నారు. ఈమేరకు శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సఖి కేంద్రంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేధింపులకు గురవుతున్న మహిళలు న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు సఖి సిబ్బంది సత్వర సహకారాలు అందించాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీస్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి తుల రవి, డీసీపీఓ ఓంకార్, లావణ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్

కల్తీ కల్లుకు మేం పూర్తిగా వ్యతిరేకం

- కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్

గోవిందరావుపేట: కల్తీ కల్లుకు మేం పూర్తిగా వ్యతిరేకం అని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధి పస్రాలో జక్కు రాజుగౌడ్ అధ్యక్షతన హైదరాబాద్‌లో కల్తీ కల్లు మరణాల దృష్ట్యా జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజసమ్మయ్య కల్లు శాంపిల్ తీసుకున్నారు. ఈసందర్భంగా బుర్ర శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రకృతి సిద్ధ కల్లులో అనేక పోషకాలున్నాయని డాక్టర్లు, శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వమే ప్రకృతి సిద్ధమైన కల్లు సేవించాలని ప్రచారం చేయాలని, శీతల పానీయాలు తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పస్రా సొసైటీ కల్లు గీత కార్మికులు జక్కు మొగిళిగౌడ్, మేర్గు సుధాకర్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, జక్కు భిక్షపతిగౌడ్, దామోదర్ గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, సునీల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



పస్రాలో కల్లు గీత కార్మికులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజసమ్మయ్య

'కు.ని'పై అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు

ములుగు రూరల్: యువతకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు అన్నారు. ఈమేరకు శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా విస్ఫోటనం వల్ల నిరుద్యోగం, పోషకాహార లోపం, జీవన ప్రమాణాల తగ్గుదల ఏర్పడుతుందన్నారు. జనాభా వృద్ధి వల్ల కలిగే సవాళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం జిల్లాలో మాతా శిశు సంక్షేమ కేంద్రాలను ఏర్పాటు చేసి 102 అంబులెన్స్ సేవలు అందిస్తుందన్నారు. ఈసేవలతో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటున్నట్లు తెలిపారు. శాశ్వత కుటుంబ నియంత్రణ పాటించే వారి జాబితాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా కేంద్ర కార్యాలయానికి పంపి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్, పవన్‌కుమార్, నాగగణేశ్, సంపత్, సాంబయ్య, స్వరూపరాణి, సూపర్‌వైజర్లు సురేశ్, దేవేందర్, నిర్మల, దేవమ్మ, వినోద్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు

క్షయ వ్యాధిని అంతమొందించాలి
జిల్లాలో క్షయ వ్యాధిని అంతమొందించాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు అన్నారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో టీబీ ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ పౌరుడు క్షయ నియంత్రణలో భాగస్వామ్యం కావాలన్నారు. క్షయ వ్యాధి గాలిలో తుంపర్ల ద్వారా త్వరగా వ్యాప్తి చెందుతుందన్నారు. క్షయ వ్యాది నివారణకు ప్రభుత్వం మందులు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

గూడేల్లో మెరుగైన విద్యనందిస్తాం

- మంత్రి సీతక్క
- ట్రాక్టర్‌లో వాగుదాటి పాఠశాల భవనం ప్రారంభం

ఏటూరునాగారం: గొత్తికోయ ఆదివాసీ చిన్నారులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. శుక్రవారం ఏటూరు నాగారం మండలం చిన్న బోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధి చింతలమోరి ఆదివాసీ గ్రామాన్ని మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ సంపత్ రావు సందర్శించారు. రాండ్ స్టాండ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన యూనిఫాంలు, పుస్తకాలు, విద్యా సామగ్రిని మంత్రితో పాటు కలెక్టర్ అదనపు కలెక్టర్లు పంపిణీ చేశారు. రాండ్ స్టాండ్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు తొమ్మిది పాఠశాలల్లోని 150 మంది పిల్లలకు అన్ని వస్తువులను అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం మంత్రి సీతక్క విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణ ప్రాంతాల్లో మంత్రి కలెక్టర్ అధికారులు మొక్కలు నాటారు. కొండాయి గ్రామం వద్ద జరుగుతున్న హైలెవెల్ బ్రిడ్జి పనులను మంత్రి సీతక్క శుక్రవారం రాత్రి పరిశీలించారు.

వాగు దాటి.. పాఠశాలను ప్రారంభించి
మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ట్రాక్టర్‌పై జంపన్నవాగు దాటి ఎలిశెట్టిపల్లికి వెళ్లారు. ప్రభుత్వ నిధులు రూ.15లక్షలతో నిర్మించిన మండల ప్రాథమిక పాఠశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కాగా.. మండల కేంద్రంలోని ఎండి. వలీబాబా తండ్రి ఇటీవల మరణించడంతో మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన పెండ్యాల సంతోశ్‌తోపాటు పలువురు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ఏటూరునాగారం: పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్

మేడారంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు
ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్‌తో కలిసి మంత్రి సీతక్క శుక్రవారం దర్శించుకున్నారు. మంత్రికి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం సీతక్క విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే మహా జాతర కోసం రూ.112 కోట్లతో ప్రాథమిక అంచనాలతో కలెక్టర్.. ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు పంపించారని తెలిపారు.

ప్లేట్స్ తయారీ యూనిట్ ప్రారంభం
గోవిందరావుపేట: మండలంలోని మొట్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో రాండ్‌స్టాండ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్, సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ వారి సహకారంతో సమ్మక్క సారలమ్మ అడవి ఆదివాసీ సహకార సమాఖ్య అడ్డాకుల ప్లేట్ తయారీ యూనిట్‌ను మంత్రి సీతక్క, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా మంత్రి మొక్క నాటారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ఎఫ్‌ఆర్‌ఓ అబ్దుల్ రహమాన్, మేడారం ఆలయ ఈఓ వీరస్వామి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేశ్‌బాబు, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, ఎన్జీఓ సంతోశ్, నాయకులు బొల్లు దేవేందర్, ఇర్స సునీల్, వెంకన్న, రఘు, మనోజ్, రవి, రాము, రాండ్ స్టాండ్ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
ములుగు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా అందిస్తామని మంత్రి దనసరి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. మంత్రి వెంట నాయకులు భవాన్‌రెడ్డి, పల్లె జయపాల్‌రెడ్డి, మాదుగుల రమేష్, చిక్కుల రాములు, చింతనిప్పుల భిక్షపతి, వంగ రవి, ఒజ్జల కుమార్, బొంతల వేణు, బోడ రఘు, గుగ్గిళ్ల సృజన్ మండల మహిళా అధ్యక్షురాలు పావని తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ పెంపుపై హర్షం

ములుగు రూరల్: తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవియాదవ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం జాతీయ రహదారిపై బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల రాజకీయ ఎదుగుదలకు సహకరించి మంత్రి వర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పొడాల ఓంప్రకాశ్, గొర్రె అంకూష్, ఒజ్జల కుమార్, బొంత వేణు, జయపాల్‌రెడ్డి, ఒజ్జల లింగన్న, నిరంజన్, ఓడ రాజు కుక్కల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మందు పాతర ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

వెంకటాపురం(కె): మందు పాతర పేలిన ఘటనలో గాయపడిన సోయం కామయ్య (45) ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల పరిధి ముకునూరు పాలెం గ్రామానికి చెందిన సోయం కామయ్య.. వెదురు తెచ్చుకోవడానికి ఈ నెల 4న కర్రె గుట్టల ప్రాంతంలోని అడవికి వెళ్లాడు. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబుపై కాలు పడడంతో అది పేలింది. దాంతో తీవ్రంగా గాయపడిన సోమయ్యను చికిత్స నిమిత్తం వరంగల్, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మానియాలో వైద్యం పొందుతూ గురువారం మృతిచెందాడు.



సోయం కామయ్య (ఫైల్)

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీపీఓ ఒంటేరు దేవరాజు అన్నారు. శుక్రవారం మేడారంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని వంట గదులు, ఆవరణను, విద్యార్థినుల హాజరు పట్టిక, మెటీరియల్ స్టాక్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీశ్ ఉన్నారు.



గదిని పరిశీలిస్తున్న డీపీఓ దేవరాజు

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు

ఏటూరునాగారం: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బి.రాజు ఆధ్వర్యంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల జీపీఎఫ్, సరెండర్, లీవుల బిల్లులు ఏళ్లు గడిచినా విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా 2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించి వారికీ పేస్కేల్ వర్తింపజేయాలన్నారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి భూక్యా సారంగపాణి, మండలం నాయకులు కానుగంటి సతీశ్, తాళ్లపల్లి మాధవి, సీహెచ్ పద్మ శ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

క్లుప్తంగా

అప్పు తీర్చలేక రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


రామక్రిష్టారెడ్డి (ఫైల్)

కేసముద్రం: అప్పు తీర్చలేక మనస్థాపానికి గురైన ఓ రైల్వే ఉద్యోగి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన కోమటిరెడ్డి రామక్రిష్టారెడ్డి (38) మూడేళ్లుగా కేసముద్రం మున్సిపాలిటీలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటూ, కురవి మండలంలోని గుండ్రాతి మడుగు రైల్వేస్టేషన్‌లో కీమాన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో అప్పు ఇచ్చిన వారు ఈనెల 9న ఇంటికి వచ్చి తమ అప్పు తీర్చాలని గొడవకు దిగారు. దాంతో అదే రోజు తీవ్ర మనస్థాపానికి గురైన రామక్రిష్టారెడ్డి.. గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ నుంచి ఇంటికి వస్తూ కేసముద్రం మండలం రాజీవ్ నగర్ తండా వద్ద గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

రేప్ కేసులో ఐదేళ్ల జైలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని వాడగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రేప్ కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెంకటాపురం సీఐ బండారి కుమార్ వివరాల ప్రకారం రేప్ కేసులో జాడి రోశయ్యకు ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ శుక్రవారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు నమోదు చేసిన ఎస్సై రేక అశోక్, దర్యాప్తు చేసిన ఎస్సై కొప్పుల తిరుపతి రావు, శిక్షపడేలా కృషి చేసిన ప్రాసిక్యూటర్, కోర్టు కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

చుట్ట తాగుతూ నిద్రలోకి..

నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

రఘునాథపల్లి: చుట్ట తాగుతూ ఓ వృద్ధురాలు నిద్రలోకి జారుకోగా.. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పండుగ వెంకటలక్ష్మి (95) ఒంటరిగా జీవనం సాగిస్తోంది. చుట్ట తాగుడు అలవాటు ఉన్న ఆమె.. గురువారం ఉదయం మంచంపై పడుకొని చుట్ట తాగుతూ నిద్రలోకి జారుకుంది. ప్రమాదవశాత్తు మంచంపై ఉన్న బెడ్‌షీట్లకు చుట్ట అంటుకొని మంటలు లేచాయి. వెంకటలక్ష్మి తేరుకొని లేచే సరికి మంటలు చుట్టుముట్టాయి. ఇంట్లో మంటలను గుర్తించిన స్థానికులు వెంటనే తలుపులు ఊడదీసి మంటలను చల్లార్చగా అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి కుమారుడు పండుగ మదార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

పెరుగుతున్న గోదావరి


వాజేడు: మండల కేంద్రం సమీపంలో రహదారిపైకి చేరిన గోదావరి వరద


వాజేడు: పూసూరు, ఏడ్జర్లపల్లి మధ్య నీట మునిగిన రహదారి


వాజేడు వద్ద వరద నీటిలోకి వెళ్లకుండా ట్రాక్టర్‌ను అడ్డుగా పెడుతున్న డ్రైవర్

- నీట మునిగిన రహదారులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వాజేడు: వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి మట్టం పెరగడంతో ములుగు జిల్లా వాజేడు మండలంలో రహదారులు పలు చోట్ల ముంపునకు గురి కావడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడి కుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పెద్ద గంగారం, చంద్రుపట్ల, టేకులగూడెం, టేకులగూడెం కాలనీ గ్రామాలు, పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. అదేవిధంగా మండల కేంద్రం సమీపంలో కొంగల వాగు ద్వారా వచ్చిన గోదావరి వరద రహదారిని ముంచింది. దాంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచాయి. కొంగల వాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు వాజేడు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదుగా రావాలి. మండల పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన ఉన్న వంతెనపైకి వరద నీరు చేరడంతో ఇక్కడ కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏడ్జర్లపల్లి, బొమ్మనపల్లి, ముత్తారం, కొత్తూరు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సి ఉంది. కోయ వీరాపురం గ్రామ సమీపంలో చాకలి వాగు వద్ద రహదారిపైకి గోదావరి చేరడంతో గ్రామస్తులు చీకుపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది.

అప్రమత్తమైన అధికారులు

గోదావరి వరద అంతకంతకు పెరుగుతుండడంతో పాటు పలు చోట్ల రహదారులను ముంచెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. వరదను పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి.. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు. రహదారులపైకి వరద నీరు చేరడంతో నీటిలోకి ఎవరూ వెళ్లకుండా ట్రాక్టర్లు అడ్డంగా పెట్టడమే కాకుండా కర్రలతో అడ్డుగా కంచె కట్టారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.


పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద ఉధృతి

పెరుగుతున్న నీటి మట్టం

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 14.28 మీటర్లు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 15.42 మీటర్లకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి నీటి మట్టం పెరుగుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల రహదారులు నీట మునిగాయి. మండల అధికారులు అప్రమత్తమై మండలంలోని పునరావాస కేంద్రాలను శుభ్రం చేసి సిద్ధం చేశారు. వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా రహదారులపై ట్రాక్టర్లు అడ్డంగా ఉంచారు.

వరద ఉధృతి



సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా చేరుతున్న వరద నీరు

- ఎగువ నుంచి 7,35,720 క్యూసెక్కుల నీరు
- బ్యారేజీ వద్ద 59 గేట్లు ఎత్తి అంతేమొత్తంలో దిగువకు..


తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్ర రూపంలో ప్రవహిస్తోంది. బ్యారేజీలోకి ఎగువ నుంచి భారీగా వరదలు చేరడంతో నిండుకుండను తలపిస్తూ దిగువకు వెళ్తోంది. వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సరస్వతి, లక్ష్మీ బ్యారేజీలలోకి భారీగా వరద నీరు చేరడంతో అక్కడ బ్యారేజీల గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దాంతో దిగువన ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా వరద చేరుతోంది. ఈ క్రమంలో తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద శుక్రవారం గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుండి 7,35,720 క్యూసెక్కుల నీరు చేరుతోంది. బ్యారేజీ వద్ద అన్ని గేట్లు 59 ఎత్తి అదేమోతాదులో దిగువకు నీటిని వదులుతున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 83.మీటర్లకుగాను 82.10 మీటర్లుగా నమోదవుతోంది. బ్యారేజీకి ఎగువన గుట్టల గంగారం పరిధిలో ఉన్న జె.చొక్కారావు ఎత్తిపోతల వద్ద ఫేజ్ -1లో రెండు మోటార్లకు గాను 1 మోటారు తోపాటు ఫేజ్ -3లో 6 మోటార్లకుగాను రెండు మోటార్ల ద్వారా 760 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎత్తిపోతల వద్ద ప్రస్తుతం 83 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..


రామన్నగూడెం గోదావరి వద్ద సిద్ధంగా ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

- రామన్నగూడెం వద్ద 14.48 మీటర్ల మేర వరద ప్రవాహం
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు


రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద గంట గంటకు పెరుగుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం ఉదయం 10 గంటలకు 14.09 మీటర్లు ఉండగా, రాత్రి 8 గంటలకు 14.48 మీటర్లకు చేరింది. గంటగంటకు వరద నీరు పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు (14.80 మీటర్లు) చేరువలో వరద ప్రవాహం కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను గోదావరి చుట్టూ పక్కల గ్రామాల్లో సిద్ధం చేసి ఉంచారు. వారి వద్ద పడవలు, లైఫ్‌జాకెట్లతో పాటు రబ్బర్ బోట్లను ఉంచారు. ఎక్కడైనా విపత్తు ప్రమాదం జరిగితే వెంటనే పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. కోయగూడ ఎల్లాపురం గ్రామంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలున్నాయని, ఎలాంటి భయాందోళనకు గ్రామస్తులు గురికావొద్దని అవగాహన కల్పించినట్లు రామన్నగూడెం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు.

ప్రాణహిత పరవళ్లు

- కాళేశ్వరం ఘాట్ వద్ద 11.790 మీటర్ల నీటిమట్టం
- మేడిగడ్డ బ్యారేజీ వద్ద 8.68 లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో


కాళేశ్వరం పుష్కర ఘాట్ మెట్లను తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత వరద కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చుతూ ఉప్పొంగి ప్రవహిస్తోంది. తెలంగాణలో అంతగా వర్షాలు లేకపోవడంతో గోదావరిలో అంతగా నీరు లేదు. మహారాష్ట్ర ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.790 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు జ్ఞానదీపాలు నీటమునిగి కొంతమేర మాత్రమే పైకి కనిపిస్తున్నాయి. రాత్రివరకు పూర్తి స్థాయిలో మునిగిపోనున్నాయి. దిగువన ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీకి వరద ప్రవాహం 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుండగా, 85గేట్లు ఎత్తివేయడంతో అదే స్థాయిలో నీటిని దిగువకు ఇంజనీరింగ్ అధికారులు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలోని గోసిఖుర్ద్ డ్యామ్ నీరు వదలడంతో రాత్రి వరకు మరింత వరద నీరు చేరుతుందని తెలిసింది.

టేకులగూడెం వంతెన మూసివేత

ములుగు రూరల్: గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అనుసంధాన జాతీయ రహదారి నంబర్ 163పై టేకులగూడెం వంతెనను మూసి వేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాజేడు మండలం పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధి టేకులగూడెం శివారులో రేగమాగు వాగు పొంగి వంతెన మీదుగా వరదనీరు ప్రవహిస్తోందని పేర్కొన్నారు. వరద ఉధృత్తి కారణంగా వంతెనపై ప్రయాణాలను నిషేధించినట్లు తెలిపారు. ఈ క్రమంలో సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మీదుగా వెళ్లాలని తెలిపారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ అంతరాయాలు తగ్గాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఏఓలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిల్, డివిజన్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 16 సర్కిళ్ల పరిధిలో ముందుగా వేయి ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు 15 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఉండే పొడవాటి లైన్లలో అమర్చుతున్నట్లు తెలిపారు. తద్వారా విద్యుత్ అంతరాయాలను త్వరగా గుర్తించి పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ నెలలో 30 సబ్‌స్టేషన్లలో, వచ్చే నెలలో 120 సబ్ స్టేషన్లలో రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్‌లు, వంగిన స్తంభాలు, తుప్పు పట్టిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్‌ను గుర్తించి ఆ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించే లైన్ల పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహన్, అశోక్, వెంకట రమణ, ఆర్.చరణ్ దాస్, జనరల్ మేనేజర్లు వేణుబాబు, కృష్ణ మోహన్, వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కంబాలపల్లి పాఠశాలకు అరుదైన అవకాశం

- ఐఐటీ మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగస్వామ్యం



కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరుదైన అవకాశం దక్కింది. ఐఐటీ మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగస్వామిగా ఎంపికైంది. ఈ ఏడాది మహబూబాబాద్ జిల్లా నుంచి ఇప్పటి వరకు ఈ ప్రోగ్రాంలో నమోదు చేసుకున్న పాఠశాలలు మొత్తం ఐదు కాగా, కంబాలపల్లి పాఠశాల వాటిలో ఒకటిగా ఎంపిక కావడం విశేషం. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ఆధునిక రంగాల్లో విద్యను అందించడంతోపాటు భవిష్యత్‌లో తగిన కెరీర్ ఎంపిక చేసుకునే అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు 8 వారాలపాటు 10 ఆన్‌లైన్ కోర్సులు చదివే అవకాశం కలుగుతుంది. ఈ కోర్సులను ఐఐటీ మద్రాస్, ఇతర ప్రముఖ విద్యా సంస్థల నిపుణులు రూపొందించారు.

కోర్సుల వివరాలు	ప్రధాన అంశాలు	మరింత సమాచారం
డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పరిచయం ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ పరిచయం ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ పరిచయం ఇంజినీరింగ్ బయాలాజికల్ సిస్టమ్స్ పరిచయం ఫన్ విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్ లా పరిచయం మ్యాథ్స్ గేమ్స్ అండ్ పజిల్స్ ఏరోస్పేస్ ఫండమెంటల్స్ వంటి మొదలైన అంశాలపై శిక్షణ	కోర్సుల వ్యవధి : 8 వారాలు (ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి ప్రారంభం) పరిశీలన : ప్రతి కోర్సుకు రూ.500 మాత్రమే రుసుం సర్టిఫికెట్ : కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఇ–సర్టిఫికెట్ లభిస్తుంది	విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలి కోర్సు అనంతరం ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ జారీ చేస్తారు పాఠశాల తరఫున బాధ్యత వహించే విధంగా పాఠశాల (గణితం) సహాయ ఉపాధ్యాయులు కాసం శ్రీనివాసరావు ఎస్పీఓసీ (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్)గా నియమితులయ్యారు

జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ సందర్శన


జోధ్‌పూర్ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వరంగల్ చౌరస్తా: రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి రాంసింగ్ సిసోడియా, పండ్లు, కూరగాయల మార్కెట్ సెక్రటరీ దుర్గారామ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజేందర్ పరివార్, కార్యదర్శి ధర్మేందర్ బండారి, కార్మిక నాయకులు సకూర్ ఘోరీతో సంఘం జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్ రావు, ప్రతినిధులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అక్కడ రైతుల నుంచి పంట దిగుమతి చార్జీలు మినహా ఎలాంటి మార్కెట్ చార్జీలు వసూలు చేయడం లేదని, మార్కెట్ సెస్ రూ.100కు 1.50 రూపాయలు వసూలు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్మిక చార్జీలు నూటికి 3.60 రూపాయలు పంట కొనుగోలుదారుడు చెల్లిస్తాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లలో పంటలను విక్రయించే కమిషన్ ఏజెంట్లు అదనంగా రైతుల నుంచి కమిషన్, మునిం, దానం, ధర్మం కూటుకు కిలో పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హర్యానా, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్ చట్టాల మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ చట్టాలను సవరించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు సంగతి సాంబయ్య, చంద్రశేఖర్, మాదం తిరుపతి, సందెపోగు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత వీరంగం

- ఇద్దరిపై దాడి.. ఒకరి పరిస్థితి విషమం
- ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు


కేడల నరేష్


బజ్జూరి వంశీ

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో యువత గంజాయి మత్తులో వీరంగం సృష్టిస్తోంది. అర్ధరాత్రి వరకు బైకుల హారన్ల మోత, కేరింతలతో రహదారులపై ఆకతాయిలు చక్కర్లు కొడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై విరుచుకు పడుతున్నారు. ఈ క్రమంలో బీట్ పోలీసులు ఉన్నా లేనట్లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అడిగింది ఇవ్వకపోతే చిరువ్యాపారులపై మత్తులో ఉన్న పోకిరీలు విచక్షణ రహితంగా దాడికి తెగబడుతున్నారు. ఈ తరహా ఘటన గురువారం అర్ధరాత్రి వరంగల్ శంభునిపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రంగశాయిపేట గవిచర్ల క్రాస్ రోడ్డులోని ఓ ఐస్‌క్రీమ్ బండి వద్ద కొంతమంది ఐస్‌క్రీమ్ తిన్నారు. డబ్బులు ఇవ్వాలని అడిగితే ఆ చిరు వ్యాపారితో పాటు అడ్డుకోబోయిన కేడల నరేష్, బజ్జూరి వంశీపై ఆకతాయిలు దాడికి చేశారు. ఈ దాడిలో కేడల నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక మిల్స్ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు సమాచారం.

మృతదేహం మా వారిది కాదు..

- దహన సంస్కారాలు చేసే సమయంలో కుటుంబ సభ్యుల గుర్తింపు
- తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు
- పోలీసుల వినతి మేరకు పోస్టుమార్టం లేకుండా బంధువులకు అప్పగించాం
- ఎంజీఎం ఆర్‌ఎంఓ శశికుమార్ వెల్లడి


ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) మృతదేహం

రాయపర్తి: 'రోడ్డు ప్రమాదంలో నీ భర్త మృతిచెందాడ'ని పోలీసులు సమాచారం అందించడంతో వరంగల్ ఎంజీఎంకు వెళ్లిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసే క్రమంలో మృతదేహం తమవారిది కాదని గుర్తించి.. తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ విచిత్ర ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన గోక కుమారస్వామి(55), రమకు ముప్పయి ఏళ్లక్రితం వివాహమైంది. వారికి ఒక కూతురు. ఇరవై ఏళ్ల క్రితం కుమారస్వామి మతిస్థిమితం కోల్పోగా అప్పటినుంచి రమ వేరుగా ఉంటున్నారు. అతను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణకేంద్రంలో యాచిస్తూ జీవిస్తున్నాడు. తొర్రూరులో ఈనెల 09వ తేదీన రోడ్డుపక్కన అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు, పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు గురువారం మృతిచెందాడు. ఈ క్రమంలో ఎంజీఎంనుంచి పోలీసులు 'నీ భర్త చనిపోయాడని' మైలారానికి చెందిన గోక రమకు సమాచారం అందించారు. ఆస్పత్రికి వెళ్లిన రమ, కుటుంబ సభ్యులకు మార్చురీనుంచి చాపతో చుట్టిన మృతదేహాన్ని అప్పగించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో నేరుగా మైలారంలోని దహనసంస్కారాలు చేసే స్థలానికి తీసుకొచ్చారు. కిందికి దించి చాప విప్పి చూడగా కుమార్తె స్వప్న ఆ మృతదేహాన్ని చూడగా తన తండ్రి చేతిపై శ్రీ అనే పచ్చబొట్టు ఉంటుందని, ఈ మృతదేహానికి పచ్చబొట్టు లేదని, తమ నాన్న కాదని తేల్చిచెప్పింది. భార్య, బంధువులు సైతం చూసి తమవారిది కాదని చెప్పడంతో తిరిగి మృతదేహాన్ని అదే అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. రమ తన భర్తను చాలా ఏళ్లుగా చూడకపోవడం.. చాపలో చుట్టి ఇవ్వడం వల్ల గుర్తించలేకపోయినట్లు కొందరు అంటున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, ఆ మృతదేహం ఎవరిది అన్నది గుర్తించాల్సి ఉంది.

పోలీసుల వినతి మేరకే..

ఎంజీఎం : ఈ నెల 9వ తేదీన అపస్మారకస్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ఎంజీఎంకు తీసుకువచ్చారని, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎంజీఎం ఆర్‌ఎంఓ శశికుమార్ తెలిపారు. కాగా, సదరు వ్యక్తి మృతదేహం రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన కుమారస్వామిగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పోస్టుమార్టం లేకుండా అప్పగించాలనే పోలీసుల వినతి మేరకు ఆ మృతదేహాన్ని భార్య, బంధువుల అంగీకారం మేరకు అప్పగించినట్లు ఆర్‌ఎంఓ తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు తమది కాదని పేర్కొని తిరిగి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.